క్లుప్తంగా

శ్రీరామచంద్రమూర్తి మహనీయుడు

విజయనగరం: ధర్మబద్ధ జీవనానికి నిలువెత్తు నిర్వచనమైన శ్రీరామచంద్రమూర్తి మహనీయుడని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మం తప్పని శ్రీరాముడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన



పోషక విలువలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఎస్తేర్‌రాణి

డెంకాడ: మండలంలోని అక్కివరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం వల్ల కలిగే ఉపయోగాలపై ఐసీడీఎస్ భోగాపురం సెక్టార్ సీడీపీఓ ఎస్తేర్‌రాణి బుధవారం వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎ.సత్యవతి, మహిళా పోలీస్ సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో పార్లమెంట్

విజయనగరం పూల్‌బాగ్: కార్మిక, కర్షక హక్కుల రక్షణకు ఏప్రిల్ 5న ప్రజా సంఘాలు చేపట్టనున్న చలో పార్లమెంట్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో విజయనగరం మార్కెట్‌యార్డు వద్ద బుధవారం జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోదీ ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలోనే అన్నదాత ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ, కార్మికులు పాల్గొన్నారు.

ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేక దృష్టి

విజయనగరం క్రైమ్: ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు తెలిపారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధించారు. వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని డీఎస్పీ తెలిపారు.

ఆందోళన విడనాడాలి..

నెల్లిమర్ల: పదో తరగతి విద్యార్థులు పరీక్షల పట్ల ఉన్న ఆందోళనను విడనాడాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జిల్లా సమన్వయకర్త బి. చంద్రావతి సూచించారు. పట్టణంలోని వేణుగోపాలపురం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ ఉషారాణి ఉన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

నెల్లిమర్ల: నగర పంచాయతీకి చెందిన 8 వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న కార్యదర్శులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని కమిషనర్ పి. బాలాజీప్రసాద్ హెచ్చరించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొంతమంది కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదన్న ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అలాగే మరికొంతమంది యూనిఫామ్ ధరించకుండా విధులకు హాజరవుతున్నట్లు తెలిసిందని చెప్పారు. అటువంటి కార్యదర్శులపై చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు.

జాగ్రత్తలతో క్యాన్సర్‌కు దూరం



డాక్టర్ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు, తదితరులు

విజయనగరం అర్బన్: ముందు జాగ్రత్తలతో క్యాన్సర్‌ను నివారించవచ్చని అంకాలజిస్ట్ పైడి వెంకటేశ్వరావు, ఫిజీషియన్ డాక్టర్ కేకే నాయుడు అన్నారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'క్యాన్సర్‌పై అవగాహన - నివారణ, చికిత్స'పై బుధవారం నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడుతూ, క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే 100 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎన్.సతీష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి 'ఆసరా'

- మహిళలకు చెక్ పంపిణీ ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ



వైఎస్సార్ ఆసరా చెక్కును పొదుపు సంఘాల మహిళలకు అందజేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

డెంకాడ:

సమాజంలో సగ భాగమున్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సమాజం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో పొదుపు సంఘాల మహిళలతో బుధవారం నిర్వహించిన సభలో ఆసరా పథకం మూడో విడత చెక్‌ను మండల సమాఖ్య సభ్యులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా మూడో విడతలో నెల్లిమర్ల నియోజకవర్గానికి రూ.40.91 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. మూడు విడతల్లో రూ.122.76 కోట్లు పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం అందించిందని చెప్పారు. మహిళలు నగదును సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు దాదాపు మహిళలకే అందిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు హయాంలో రుణమాఫీ అని చెప్పి మోసం చేసిన విషయాన్ని మహిళలు మరిచిపోలేదన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నట్లు చెప్పారు. భోగాపురం ఎయిపోర్టు నిర్మాణంతో మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. విశాఖ పరిపాలనా రాజధానిగా చేయడం వల్ల ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీలు పిన్నింటి తమ్మునాయుడు, కూరాకుల అనిత, ఎంపీడీఓ స్వరూపారాణి, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఏసీ రాజ్‌కుమార్, ఏపీఎం విజయలక్ష్మి, పలు గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన పొదుపు సంఘాల మహిళలు

మూడు పథకాలు అందుతున్నాయి..



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి తమకు వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యాకానుకతో కలిపి మూడు పథకాల ద్వారా నిధులు అందుతున్నాయి. వీటితో పాటు ఇళ్లు కూడా మంజూరైంది. సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న డబ్బులతో కుట్టుమిషన్ పెట్టుకున్నాను.

– జ్యోతి, అమృత పొదుపు సంఘం, గుణుపూరు

జగనే మళ్లీ గెలవాలి..



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ గెలవాలి. అనేక పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక సహాయం చేసి, స్వయం ఉపాధికి మార్గం చూపుతున్నారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు. జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– దేవి, పొదుపు సంఘం మహిళ, డి.తాళ్లవలస

సమస్యలు తెలుసుకుంటూ.. సంక్షేమాన్ని వివరిస్తూ..

- 20వ డివిజన్‌లో 'గడప గడపకు..'



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రభుత్వం ఏర్పడి సుమారు నాలుగు సంవత్సరాలు కావస్తోంది...ఇప్పటివరకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలన్నీ మీ అర్హతల ఆధారంగా వస్తున్నాయా...? పథకాల అమలులో మీనుంచి ఎవరైనా లంచాలు ఆశిస్తున్నారా... ? మీ ప్రాంతంలో సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆరా తీశారు. నగరంలోని 20వ డివిజన్‌లో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై ప్రజలందరూ సంతృప్తి వ్యక్తం చేయడంతో కోలగట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఒక్కో లబ్ధిదారుడికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ తవిటిరాజు మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెలుసుకున్న సమస్యలను పరిష్కరించడం గొప్ప విషయమన్నారు. నీతివంతమైన, సంక్షేమమైన పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, 21వ డివిజన్ కార్పొరేటర్ కనకాల నాగవల్లి, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, జోనల్ ఇన్‌చార్జ్ కాళ్ల సూరిబాబు, కనకల గిరి, డివిజన్ అధ్యక్షుడు పచ్చిపులుసు కృష్ణమూర్తి, అయ్యప్ప, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే తినాలి..



కూరగాయలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

విజయనగరం రూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు భుజించాలని ఐసీడీఎస్ గంట్యాడ సెక్టార్ పీఓ డి.ఉమాభారతి సూచించారు. మండలంలోని చెల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో ద్వారా పిల్లలు, గర్భిణిలు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందన్నారు. అలాగే చిరుధాన్యాలతో చేసే ఆహార పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పౌష్టికాహారం ఆవశ్యకతపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్లు అందజేసిన ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ

డెంకాడ: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు మిన్నగా తీర్చిదిద్దుతున్నట్లు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఆవరణలో ఎనిమిది మంది విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్లు, నలుగురికి వినికిడి యంత్రాలు అందజేశారు. అలాగే కంటివెలుగు పథకం ద్వారా విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నాడు – నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోందన్నారు. విద్యార్థులకు మరిన్ని పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలనే ఉద్దేశంతో రాగిజావ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీఓ స్వరూపారాణి, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులతో 'ఉపాధి'



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

- మున్సిపల్ కమిషనర్ శ్రీరాములునాయుడు
- ఘనంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ 41వ వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో ప్రవేశాలతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని పూల్‌బాగ్‌లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 41వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ శ్రీరాములునాయుడు మాట్లాడుతూ, పాలిటెక్నిక్ కళాశాలల్లో కంప్యూటర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, వివిధ వృత్తి విద్యా కోర్సులను అందిస్తున్నారని చెప్పారు. పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ ఆర్.పాపారావు మాట్లాడుతూ, డిప్లమో కోర్సులతో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. పరిశ్రమల శాఖ నుంచి విద్యార్థులకు అవసరమైన సెమినార్లు, వివిధ ప్రాజెక్టుల ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం క్రీడలు, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆశారమణి, కళాశాల స్టూడెంట్ అడ్వైజర్ ఎస్‌వీ రమణ, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సాయికుమార్

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని బీసీ కాలనీ యూపీహెచ్‌సీ వైద్యాధికారి సాయికుమార్ సూచించారు. బీసీ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, పిల్లలు, బాలింతలకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారిన పడకుండా మునగాకు , తోటకూరతో పాటు ఆయా కాలాల్లో లభించే కూరగాయలను ఎక్కువగా తినాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ, మేరీ వనిత, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పూసపాటిరేగ: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని భోగాపురం సెక్టార్ ఐసీడీఎస్ పీఓ ఎస్తేర్‌రాణి అన్నారు. పూసపాటిరేగలో జరిగిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది బుచ్చి బంగారమ్మ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పన్ను చెల్లింపులకు అవకాశం



పన్నులు వసూలు చేస్తున్న కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది

విజయనగరం: ఆస్తి, ఖాళీ స్థలాలు, నీటి పన్ను బకాయిలకు సంబంధించి పన్ను చెల్లింపుదారులు గురువారం చెల్లించవచ్చని కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా ప్రభుత్వం సెలవురోజు ప్రకటించినప్పటికీ, ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండడంతో ఈనెల 30వ తేదీన కూడా కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లతో పాటు సచివాలయాల్లో పన్నులు చెల్లించవచ్చని సూచించారు. అదేవిధంగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా కూడా పన్ను చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.35.05 కోట్లు మొత్తం పన్నుల రూపంలో జమకాగా... బుధవారం ఒక్క రోజే కోటి రూపాయలు వసూలు చేసినట్లు తెలిపారు.

రూ.3.50 కోట్లతో.. అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలో శంకుస్థాపనల వారోత్సవాలు ప్రారంభం



5వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.3.50 కోట్లతో 50 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలో చేపట్టదలచిన శంకుస్థాపనల వారోత్సవాలకు కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆయన శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 5వ డివిజన్‌లో రూ.15 లక్షలతో.. 6వ డివిజన్‌లో రూ.22.50 లక్షలతో.. 9వ డివిజన్‌లో రూ.9.20 లక్షలతో.. 1వ డివిజన్‌లో రూ.7.50 లక్షలతో.. 13వ డివిజన్‌లో రూ.7.50 లక్షలతో.. 20వ డివిజన్‌లో రూ.16 లక్షలతో చేపట్టాల్సిన పనులకు బుధవరం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, నగరంలో శంకుస్థాపన వారోత్సవాలు ప్రారంభించినట్లు చెప్పారు. అదేవిధంగా ఏప్రిల్ 6న ఇప్పటివరకు పూర్తయిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రారంభోత్సవ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో తాము చేపట్టిన వార్డు పర్యటనలో గాని, ప్రస్తుతం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తున్న సమయంలో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొద్ది రోజులుగా అభివృద్ధి పనులకు ఆటంకం నెలకొందని.. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరం కార్పొరేషన్‌గా అవతరించిన తర్వాత ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు ఉండకూడదన్న ఉద్దేశంతో సంపూర్ణ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. రహదారులు, కాలువలు, కల్వర్టులు ఏర్పాటు చేయడంతో పాటు పారిశుధ్య మెరుగుకు అవసరమైన చర్యలు చేపట్టడం, వీధి దీపాలు నిరంతరం వెలిగే విధంగా చూడడం వంటి అనేక ప్రజా సంబంధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఐదు రోజులకోసారి మంచినీటి పంపిణీ జరిగేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తున్నామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు ఆంధ్ర జలాశయం నుంచి చంపావతి నదిలోకి నీటిని మళ్లించామని, రానున్న రెండు నెలల్లో సమస్య తీవ్రరూపం దాల్చితే తోటపల్లి నుంచి గడిగెడ్డకు అక్కడి నుంచి చంపావతి నదిలోకి నీటిని మళ్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు గాదం మురళి, ఆల్తి సత్యకుమారి, కంటుభుక్త తవిటిరాజు, జోనల్ ఇన్‌చార్జ్‌లు ముద్దాడ మధు, ముచ్చు శ్రీనివాసరావు, బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, కాళ్ల సూరిబాబు, కేవీపీ రాజు, కార్పొరేషన్ ఈఈ కె. శ్రీనివాసరావు, డీఈ అప్పారావు, ఏఈలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రాస్‌ప్రోగ్రాం వాహనం ప్రారంభం



క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా క్రాస్‌ప్రోగ్రాం కార్యక్రమం అమలుచేస్తున్నట్లు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో పాడైన బోర్లను బాగుచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఎంపీడీఓ స్వరూపారాణి, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వైకుంఠనాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన డిప్యూటీ స్పీకర్



విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు డిప్యూటీ స్పీకర్‌ను ఆయన నివాసంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో 9 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరచడం అభినందనీయమన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. జగనన్న గోరుముద్ద, పౌష్టికాహారం, నాడు – నేడు ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పన వంటి అనేక చర్యలు చేపట్టడంతో విద్యార్థుల్లో కూడా విద్య పట్ల ఆసక్తి పెరుగుతోందన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఫలితంగా కస్పా ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కస్పా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.